క్లుప్తంగా

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులు

ఏలూరు రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు అన్నారు. మే 8 నుంచి జూన్ 11 వరకూ చాటపర్రు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఆదివారం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు చిన్నారులకు ఈ శిక్షణ శిబిరం ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. చిత్రలేఖనం, వ్యాసరచన, భరత నాట్యం తదితర పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసారు. గ్రంథాలయ అధికారిణి కే వాసుకి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో డీకేఎంయూ క్యాంప్ మండల కార్యదర్శి పి పెంటయ్య, పి సూర్యారావు, పి రాము తదితరులు పాల్గొన్నారు.

బోరుకు శంకుస్థాపన

ఉంగుటూరు: జలకళ పేద రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోందని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షుడు, గోపినాథపట్నం సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి అన్నారు. ఆదివారం గోపినాథపట్నంలో చేబ్రోలుకు చెందిన రైతు గుడ్ల శ్రీను పొలంలో జలకళలో మంజూరైన బోరుకు విష్ణుమూర్తి శంకస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు మాజీ సర్పంచి వైసీపీ నాయకుడు కరణం బుజ్జి, నాయకులు రాయి మునేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు ఆకుల రాజా పాల్గొన్నారు.

జయశ్రీ రాఘవన్‌కు డాక్టరేట్



హైదరాబాద్‌లో డార్టరేట్ అందుకుంటున్న ఏలూరుకు చెందిన జయశ్రీ రాఘవన్

ఏలూరు (టూటౌన్): ఏలూరుకు చెందిన జయశ్రీ రాఘవన్ డాక్టరేట్ అందుకున్నారు. ఈ నెల 10న హైదరాబాద్‌లోని సరస్వతి పరిషత్‌లో మయూరి ఆర్ట్స్ 33 వసంతాల కార్యక్రమాల్లో ఆమెకు ఈ అవార్డును అందజేసారు. ప్రస్తుతం జయశ్రీ వామ్ మహిళా విభాగం సౌత్ ఇండియా అధ్యక్షుడిగా, మహిళా వైశ్య వారధి గ్లోబల్ ప్రెసిడెంట్‌గా, వాసవి పరివార్ ఇంటర్నేషనల్ కేంద్ర కమిటీ సభ్యురాలిగా పని చేస్తున్నారు. ఈ ప్రదానోత్సవానికి ముఖ్య అతిథులుగా నటుడు పసునూరి శ్రీనివాస్, గోదావరి అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి ఏ.నీలిమ నాయుడు, టీవీ సీరియల్ నటుడు రవిశర్మ పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు

- ఫ్యామిలీ ఫిజీషియన్ పథకంతో సత్ఫలితాలు
- జిల్లాలో 5.56 లక్షల మందికి సేవలు
- బాలింతలు, రోగుల ఇళ్లకు వెళ్లి చికిత్స



బాలింతను, బిడ్డను ఇంటికే వెళ్లి పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



ఇంటివద్దకే వెళ్లి రోగికి చికిత్స అందిస్తున్న వైద్యుడు

ఏలూరు టౌన్: టీడీపీ హయాంలో ఆసుపత్రులు అధ్వానంగా ఉండేవి. పీహెచ్‌సీకి వెళితే వైద్యుడు ఉంటారో లేదో తెలియని పరిస్థితి. ఒకవేళ నర్సు ఉన్నా మందులు ఉండేవి కాదు. చిన్నపాటి అనారోగ్యం వచ్చినా వ్యయప్రయాసలతో దూరంలోని పట్టణాలకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి. గర్భిణులు, దీర్ఘకాలిక రోగులు, వృద్ధుల కష్టాలు వర్ణనాతీతం. పరీక్షలు చేసే అవకాశం ఉండేది కాదు. సర్కారు దవాఖానా వైపు చూడాలంటే పేదోడికి జబ్బు మరింత పెరిగేది.

నేడు – ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కారు పేదలకు ఆరోగ్య భరోసా తెచ్చింది. గ్రామాల్లోనే డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పీహెచ్‌సీలను అభివృద్ధి చేశారు. అన్ని వసతులతో రోగులకు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. గ్రామాలకు 104 సంచార వైద్యశాల క్రమం తప్పకుండా ఠంఛన్‌గా వెళుతోంది. ఫ్యామిలీ ఫిజీషియన్ పథకంలో గ్రామీణ ప్రాంత పేదలు రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దనే వైద్యసేవలు పొందుతున్నారు. ఊరిలోనే వైద్య పరీక్షలు, 156 రకాల మందులు ఉచితంగా ఇస్తూ రోగులకు భరోసా ఇస్తున్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. పేదల ప్రజలకు జబ్బు చేస్తే భయపడే రోజులు పోయాయి. వైద్యరంగంలో చేపట్టిన సంస్కరణలతో నూతన అధ్యాయానికి తెరతీశారు. ప్రభుత్వ ఆసుపత్రులు కార్పొరేట్ స్థాయి సేవలు అందుబాటులోకి వచ్చాయి. పేదోడికి పెద్ద రోగమొస్తే ఆ కుటుంబం అప్పుల ఊబిలో కూరుకుపోయి దైన్యస్థితిలో కొట్టుమిట్టాడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదవాడి పక్షాన నిలబడింది. గ్రామాల చెంతకే వైద్యసేవలు, ఇంటి వద్దకే వైద్యులు అనే నూతన విధానంతో ప్రజల మనస్సులు గెలుచుకుంటోంది. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో గ్రామీణ ప్రాంత ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక రోగాల బాధితులు, వృద్ధులు, వికలాంగులకు 104 సంచార వైద్యశాల, ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎంతో మేలు చేస్తోందని చెబుతున్నారు. తమ గ్రామంలోనే, ఇంటి వద్దకే వైద్యసేవలు, మందులు అందుబాటులోకి రావటంపై వారంతా సంతోషంగా ఉన్నారు.

జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్, 104 సేవలు ఇలా..

ఏలూరు జిల్లా వ్యాప్తంగా 104 సంచార వైద్యశాల, ఫ్యామిలీ డాక్టర్ విధానంలో 2022 అక్టోబర్ నుంచి 2023 ఏప్రిల్ నెలాఖరు వరకూ జిల్లాలో వైద్య సేవలు పొందిన వారు.

వైద్యం పొందిన వారు	–	5,56,039
జనరల్ ఓపీ	–	3,28,650
యుక్తవయస్సు వారు	–	973
గర్భిణులు	–	39,896
బాలింతలు	–	23,104
రక్తహీనత బాధితులు	–	2,892
హైపర్ టెన్షన్	–	71,137
మధుమేహం	–	69,852
బీపీ	–	18,326
ఓరల్ క్యాన్సర్	–	894
రొమ్ము క్యాన్సర్	–	116
సర్వైకల్ క్యాన్సర్	–	92
టీబీ బాధితులు	–	107

పేదలకు ఉపయోగకరం



మా గ్రామానికి ఫ్యామిలీ డాక్టర్ వస్తున్నారు. అందరికీ వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు ఇస్తున్నారు. ప్రైవేటు వైద్యుల దగ్గరకు వెళ్లే అవసరం లేకుండానే వైద్య పరీక్షలు మా గ్రామంలోనే చేస్తున్నారు. 104 వాహనంలో డాక్టర్, నర్సులు వస్తున్నారు. పరీక్షలు చేస్తున్నారు, నెలనెలా మందులు ఇస్తున్నారు. వైద్య శిబిరం వద్దకు రాలేని బాధితులకు ఇంటికే వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్నారు.

– టి. రమాదేవి, వసంతవాడ

ఇంటివద్దకే వైద్య సేవలు



ఏలూరు జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ విధానం మంచి ఫలితాలు ఇస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఏడాది కాలంలో 5.56 లక్షల మంది పేదవర్గాల ప్రజలకు వైద్య సేవలు గ్రామాల్లోనే అందించాం. నెలలో రెండు సార్లు 104 సంచార వైద్యశాలతో వైద్య సిబ్బంది ప్రతి గ్రామానికి వెళుతూ వైద్య పరీక్షలు చేసి, మందులు ఇస్తున్నారు. ప్రతి పీహెచ్‌సీలోనూ ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. ప్రధానంగా గర్భిణులు, వృద్ధులు, మంచాన పడిన రోగులు, దీర్ఘకాలిక రోగాల బాధితులు ఇలా ప్రాధాన్యత క్రమంలో సేవలు అందిస్తున్నారు.

– జి.గణేష్, అత్యవసర సేవల జోనల్ మేనేజర్

గంగానమ్మ గుడిలో ప్రత్యేక పూజలు

ఏలూరు (టూటౌన్): స్థానిక కొత్తపేటలోని గౌరీ పరమేశ్వర విఘ్నేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన గంగానమ్మ పోతురాజు స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ముగింపు సందర్భంగా బీజేపీ ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ గారపాటి చౌదరి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గారపాటి చౌదరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ బుంగ నాగరాజు, కార్యదర్శి దేవతోటి వెంకట ప్రసాద్, శనాపతి పెద్దిరాజు, కొప్పుల మహేష్, తాబేలు కుమార్, సాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం



విద్యార్థులకు జ్ఞాపిక అందిస్తున్న సంఘం ప్రతినిధులు

ఏలూరు రూరల్: పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ చాటిన నాగవంశీ విద్యార్థులకు నాగవంశీల సంక్షేమ సంఘం సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం ఏలూరు మండలం మాదేపల్లిలో నాగవంశీల సంఘం కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరం, దెందులూరులో చదువుకుంటున్న పేద విద్యార్థులకు కాళ్ళ నరసింహారావు జ్ఞాపకార్థం శ్రావణ్‌కుమార్ నగదు ప్రోత్సాహం, జ్ఞాపికలు అందించి అభినందించారు.

మైనర్లకు మోటారు సైకిళ్లు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు

- వన్‌టౌన్,టూటౌన్ సీఐలు ఆదిప్రసాద్, చంద్రశేఖర్
- ఏలూరు నగరంలో ప్రత్యేక డ్రైవ్



ఏలూరు వన్‌టౌన్‌లో మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ఆదిప్రసాద్, చిత్రంలో ఎస్సైలు



ఏలూరు టూటౌన్ ప్రాంతంలో కౌన్సెలింగ్ ఇస్తున్న టూటౌన్ సీఐ చంద్రశేఖర్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మైనర్లకు మోటారు సైకిళ్లు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఏలూరు ఎస్పీ డీ.మేరి ప్రశాంతి హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాలతో ఏలూరు నగరంలో వాహన తనిఖీలు చేపట్టారు. మైనర్లు వాహనాలు నడుపుతూ కనిపిస్తే వారికి, వారి తల్లిదండ్రులకు సైతం కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్టం మేరకు నడుచుకోవాలని హెచ్చరించారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సైలు ఎస్.రామకృష్ణ, మధీన బాషా తమ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వాహనాలను తనిఖీ చేయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్సులు లేనివారికి, ప్రధానంగా మైనర్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. పలువురు మైనర్లు మోటారు సైకిళ్లు నడుపుతూ పట్టుబడడంతో వారి తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడుతూ నిబంధనలు పాటించకుంటే కేసులు నమోదు చేస్తామని సీఐ ఆదిప్రసాద్ హెచ్చరించారు. ఏలూరు టూటౌన్ ప్రాంతంలో టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆర్ఆర్‌పేట శ్రీనివాస థియేటర్, పత్తేబాద, తంగెళ్ళమూడి తదితర ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. మోటారు సైకిళ్లు నడిపేవారు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వేగంగా మోటారు సైకిళ్లు నడుపుతూ ప్రమాదాల బారిన పడితే వారి తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలి



ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష పార్టీలు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసిన బీజేపీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విశాఖ పర్యటనను నిరసిస్తూ ఏలూరులో వామపక్ష పార్టీలు నిరసన వ్యక్తం చేసాయి. స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బద్ద వెంకట్రావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు కంపెనీలకు అప్పగించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర మంత్రులు రాష్ట్రంలో తిరిగే నైతిక అర్హత కోల్పోయారన్నారు. దేశ ప్రజల మధ్య ప్రాంతీయ, మత బేధాలు సృష్టించి ఘర్షణలకు బీజేపీ ఆజ్యం పోస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఏలూరు కార్యదర్శి పి.కిషోర్, సీపీఐ ఏలూరు కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ అ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాస్, పీవీ రామకృష్ణ, వి.సాయిబాబు, వీవీఎస్ ప్రసాద్, జె.గోపి, ఎస్ సత్యనారయణ, కె.కృష్ణమాచార్యులు, కురెళ్ల వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మి, ఎంఏ హకీమ్, తెర్లాపు శ్రీను, ఉప్పులూరి రవి, ఎం.అప్పారావు, జి.నాగేశ్వరరావు, సీహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉంగుటూరులో ఉచిత ఇన్సులిన్ శిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డా.పీవీ రావు

ఉంగుటూరు: ఉంగుటూరులో డా.పాతూరి శివన్నారాయణ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత ఇన్సులిన్ మెడికల్ శిబిరం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ శిబిరానికి 18 ఏళ్లలోపు పిల్లలు మూడు జిల్లాలకు చెందిన 80 మంది, పెద్దవాళ్లు 25 మంది హాజరయ్యారు. ఆలిండియా డయాబెటీస్ సొసైటీ అధ్యక్షుడు డా.పీవీ రావు స్వయంగా ఈ శిబిరంలో సేవలు అందించారు. ఈ శిబిరానికి హాజరైన రోగులను అమెరికా నుంచి తెప్పించిన యంత్రంతో పరీక్షించారు. మూడునెలలకు సరిపోయే ఇన్సులిన్ మందును, ప్రొటీన్ పౌడర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎక్స్ కంపెనీ ఉచితంగా హెల్త్ డ్రింకు పంపిణీ చేసింది. వచ్చిన వారందరికీ ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు. ట్రస్టు నిర్వాహకులు పూతూరి వంశీకృష్ణ, సహాయకులుగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, పాతూరి విజయకుమార్ పాల్గొన్నారు. ఉచిత కంటి వైద్యశాల టెక్నీషియన్ మోహిని, ట్రస్టు ఉచిత వైద్యశాల టెక్నీషియన్ బండారు మెనిక ప్రసన్న హైదరాబాదు నుంచి వచ్చిన వైద్యులు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

సినీ నటుడు సుమన్‌కు ఆహ్వానం



సినీ నటుడు సుమన్‌ని సత్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

కొయ్యలగూడెం : త్వరలో నిర్వహించబోయే గౌడ గర్జన మహాసభకు హాజరుకావాలని సినీ నటుడు సుమన్‌ని ఆహ్వానించినట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర గౌడ్ సంఘం సభ్యులు కాశగాని గోఖలే పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం విచ్చేసిన సుమన్‌ను ఆదివారం రాష్ట్ర గౌడ సంఘం నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సుమన్‌ను శాలువాతో సత్కరించామన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర గౌడ గర్జన మహాసభకు నిర్ణయించే తేదీపై ఈ నెల 25న జంగారెడ్డిగూడెంలో ముఖ్య నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర గౌడ గర్జన కార్యక్రమానికి సుమన్ తప్పనిసరిగా హాజరవుతానని అన్నారని, అలాగే కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానించినట్లు తెలిపారు.

రైస్ మిల్లు కార్మికులకు వేతనాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రమణ

జంగారెడ్డిగూడెం : రైస్ మిల్లు కార్మికులకు వేతనాలు పెంచాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. ఆదివారం ధర్మన్న స్మారక భవనంలో ఐఎఫ్‌టీయూ పట్టణ కమిటీ విస్తృత స్థాయి సమావేశం మంచిలి రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం ఏరియాలో నాలుగున్నర ఏళ్ల క్రితం రైస్ మిల్లు కార్మికులకు అగ్రిమెంట్ జరిగిందని, రెండున్నర ఏళ్ల క్రితం జరగాల్సిన అగ్రిమెంట్ కరోనా వలన నిలిచిపోయిందన్నారు. రేట్లు పెంచాలని కార్మిక సంఘం డిమాండ్ నోటీసు ఇచ్చినా రైస్ మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయన్నారు. హమాలీలకు, డ్రైవర్లకు 15 రోజులలో వేతనాలు పెంచకపోతే సమ్మె చేసేందుకు కార్మికులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమ్మెకు పట్టణంలో కార్మిక వర్గం సహకరించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో తమ్మా సోమలింగ మల్లికార్జున, మాల్చి కొండయ్య, శ్యామలరావు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

దెందులూరు: మండలంలోని చల్లచింతలపూడిలో ఆదివారం తెల్లవారు జామున గడ్డివామును గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల మేతకు ఉపయోగపడే గడ్డివాములను దగ్ధం చేయడమేమిటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే రైతులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. బాధిత రైతులు మాట్లాడుతూ గడ్డివామును దగ్ధం చేసినవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

నూతన జెడ్పీ చైర్‌పర్సన్‌కు పలువురి అభినందన

దెందులూరు: గాలాయగూడెం గ్రామాభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు అన్నారు. ఆదివారం నూతన జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి, వార్డు మెంబర్లు శ్రీధర్, రాజేష్‌తో కలిసి సత్కరించారు. గ్రామాభివృద్ధికి సంబంధించి వినతిపత్రం అందజేశారు. గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ అన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05-08
బెండకాయలు	28	కంద	56
పచ్చిమిర్చి	44-50	బీట్‌రూట్	34
కాకర కాయలు	50	కీరా దోస	40
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	116
బీరకాయలు (పందిరి)	--	అల్లం	232
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34	పాలకూర	8-10
దొండకాయలు	22	చుక్కకూర	8-10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	12	బఠాణి	--
ఆనపకాయ (1)	15	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	15	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	08
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	00
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	20
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	21

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	04
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	05
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	30
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	36
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	36
ఏలూరు -తిరుపతి	16.00	4830	34

పునఃప్రారంభోత్సవానికి ప్రభుత్వ బడులు ముస్తాబు



ఛానమిల్లి హైస్కూల్లో చెత్త తొలగిస్తున్న కూలీలు



బువ్వనపల్లి యూపీ పాఠశాలలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

గణపవరం: చదువుల పండుగకు సర్వం సిద్ధమైంది. సరస్వతీ నిలయాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభ రోజున పాఠశాలలను సుందరంగా అలంకరించి ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా గణపవరం, నిడమర్రు మండలాల్లోని సుమారు 100 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ముస్తాబు చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. నాలుగు రోజులుగా పాఠశాల తరగతి గదులు, వరండాలలో బూజులు దులిపించి, నీటితో శుభ్రంగా కడిగించారు. పాఠశాల ఆట స్థలాల్లో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి, కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు వ్యర్థాలను శుభ్రం చేశారు. పాఠశాల ఆవరణ నిండా రంగురంగుల రంగవల్లులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పాఠశాల గుమ్మాలు, కిటికీలకు మామిడి తోరణాలు కట్టారు. ఈనెల 12వతేదీ సోమవారం పాఠశాల ప్రారంభం రోజునే పండుగ వాతావరణంలో జగనన్న విద్యాకానుక కిట్లు, పాఠ్యపుస్తకాలు, ఎస్ఎంసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, దాతల సమక్షంలో విద్యార్థులకు పంపిణీ చేయడానికి ఉపాధ్యాయులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు అన్ని పాఠశాలలకు 50 శాతం పైగా కొత్త ఉపాధ్యాయులు వచ్చి చేరారు. తొలిరోజునే జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, రాగిజావ అందించాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో ఉపాధ్యాయులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ప్రభుత్వం అన్ని పాఠశాలలకు బియ్యం, కోడిగుడ్లు, చిక్కీలు, రాగి పౌడర్, బెల్లంపొడి సరఫరా చేసింది.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, ఐహిదంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఏలూరు

99122 20559
95055 08399
96408 32693

Office mail : tpgadvt@gmail.com